

జీవించేందుకే మనిషి తినాలి

సమాజ సంక్షేమానికి జీవించాలి

- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com

**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ : janaswaramnews@gmail.com

మొబైల్ నెంబర్ : 7013030690

సంపుటి : 4 | సంచిక : 244 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 19-03-2025 | పేజీలు : 5


# వాట్సప్ గవర్నెన్సు.. మా లక్ష్యమిదే..

### నెలఖారుకు 300 సేవలు

**అమరావతి, మార్చి 18 (జనస్వరం) :** వాట్సప్ గవర్నెన్స్‌పై ఏపీ శాసనసనసభలో లఘు చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ పటేల్ పట్వారీ వ్యవస్థను రూపుమాపి ప్రభుత్వాన్ని ప్రజల దగ్గరకు తీసుకెళ్లారని.. చంద్రబాబు పౌరసేవలను ఈసేవగా మార్చి ప్రజల వద్దకు పాలన తీసుకెళ్లారని తెలిపారు. పాదయాత్ర ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పూర్తిగా అర్థం చేసుకున్నామన్నారు. ప్రభుత్వం నుంచి సేవలు అందుకోవాలంటే చేతులు కట్టుకుని నిల్చున్న పరిస్థితి ప్రజలదన్నారు. అందుకే సులభతరంగా పౌరసేవలు అందాలని సంకల్పించుకున్నామని చెప్పారు. మంగళగిరిలో ఓ ఎంపీపీ కుల ధృవీకరణ పత్రం అడిగితే గత ప్రభుత్వ హయాంలో వేధించారని.. అప్పుడే ప్రజలకు అత్యంత సులువుగా సర్టిఫికెట్లు జారీ చేసేలా వాట్సప్ గవర్నెనెన్సు తెచ్చామన్నారు. విజిబుల్ గవర్నెన్సు ఇన్విజిబుల్ గవర్నమెంట్ అనే అంశాన్ని బలంగా నమ్ముతున్నట్లు తెలిపారు. ఈ పౌరసేవల కోసం మళ్లీ ప్రత్యేకంగా మరో యాప్ కాకుండా అందరూ వినియోగించే వాట్సప్‌నే దీని కోసం వాడుకోవాలని భావించామన్నారు.

**ఈనెలాఖరుకు 300 సేవలు :**

ప్రస్తుతం 200 పౌర సేవలు వాట్సప్ ద్వారా అందించగలుగుతున్నామని అన్నారు. మన మిత్ర పేరిట ఈ వాట్సప్ గవర్నెన్సు సేవలు అందిస్తున్నామన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో వాయిస్ ద్వారా కూడా సేవలు అందించాలని భావిస్తున్నామని చెప్పారు. రెవెన్యూ సర్టిఫికెట్లు, ఆస్తి పన్నులను చెల్లించేలా వాట్సప్ గవర్నెన్సు సేవలు ఉంటాయన్నారు. ఈ నెలాఖరుకు 300 పౌరసేవలను అందించేలా లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ప్రతీ ఆరు నెలలకు ప్రజలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ఎందుకు తిరగాలనే ఈ వాట్సప్ గవర్నెన్సు సేవలు అని స్పష్టం చేశారు. దీనికోసం కొన్ని చట్టాలను కూడా సవరించాలని భావిస్తున్నామన్నారు. క్యూఆర్ కోడ్ సాయంతో ఈ ధృవీకరణ పత్రాలను జారీ చేయబోతున్నామని వెల్లడించారు.

**త్వరలోనే టీటీడీ సేవలు.. :**

ఏఐ ఛాట్ బోట్ ద్వారానూ వాట్సప్ గవర్నెన్సు సేవలు అందేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.




ప్రస్తుతం దేశ వ్యాప్తంగా భాషపై చర్చ జరుగుతోందని.. ఏపీలో చాలా భాషలు మాట్లాడే వ్యక్తులు ఉన్నారన్నారు. వారందరికీ వాట్సప్ గవర్నెన్సు సేవలు ఆయా భాషల్లోనే అందుతాయని తెలిపారు. ప్రస్తుతం 73 దేవాదాయశాఖకు చెందిన సేవలు వాట్సప్ గవర్నెన్సు ద్వారా అందుతున్నాయన్నారు. త్వరలోనే టీటీడీ సేవలు కూడా వాట్సప్ గవర్నెన్సు ద్వారా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కొత్త కరెంటు కనెక్షన్ కావాలన్నా ఇప్పుడు వాట్సప్ ద్వారా అందుకోవచ్చన్నారు. 19 రెవెన్యూ సేవలు కూడా వాట్సప్ గవర్నెన్సు ద్వారా అందుతున్నాయన్నారు.

**ఫోన్‌కే హాల్‌టికెట్స్.. :**

ప్రజలు తమ ఇబ్బందులకు సంబంధించిన ఫిర్యాదులు కూడా దీని ద్వారా నమోదు చేయొచ్చన్నారు. 51 లక్షల లావాదేవీలు వాట్సప్ గవర్నెన్సు ద్వారా ఇప్పటి వరకూ జరిగాయని.. విద్యాశాఖ నుంచి హాల్ టికెట్ల జారీ కూడా వాట్సప్ గవర్నెన్సు ద్వారా అందుతున్నాయన్నారు. పరీక్ష రాసే విద్యార్థుల హాల్ టికెట్లు నేరుగా వాళ్ల ఫోన్‌కే వచ్చేస్తున్నాయని.. ఇదో సక్సెస్ స్టోరీ అని చెప్పుకొచ్చారు. విద్యాల పరీక్షా ఫలితాలు కూడా వాట్సప్ ద్వారా ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి పౌరులకు అందించిన లావాదేవీలు కోటీ యాభై లక్షల మేర జరిగితే అందులో వాట్సప్ గవర్నెన్సు సేవలే 51 లక్షల వరకూ ఉన్నాయన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన సమాచారం అంతా డేటా లేక్ ద్వారా సమన్వయపరిచి సేవలు అందిస్తున్నామని తెలిపారు.

**పూర్తి భద్రంగా డేటా.. :**

కేవలం పది సెకన్లలోనే పౌరులకు సేవలు అందించాలన్నది తమ లక్ష్యమని చెప్పుకొచ్చారు. అలాగే పౌరులకు సంబంధించిన సమాచారం కూడా పూర్తి భద్రంగా ఉంటుందన్నారు. సైబర్ సెక్యూరిటీ విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడేది లేదని తేల్చిచెప్పారు. వ్యక్తిగత డేటాను ఎక్కడా ఎవరితోనూ పంచుకోవటం లేదన్నారు. పూర్తిగా ఎన్‌క్రిప్టెడ్ డేటా మాత్రమే నేరుగా వినియోగదారుకు వెళ్తుందన్నారు. ఆధార్ ఎనేబుల్డ్ ఓటీపీ మాత్రమే జారీ అవుతుందన్నారు. ఐటీ చట్టం ప్రకారం వాట్సప్ గవర్నెన్సు ద్వారా జారీ అయ్యే పత్రాలకు పూర్తి చట్టబద్ధత ఉందన్నారు. సాంకేతికత విషయంలో పొరుగు రాష్ట్రాలు కూడా పోటీ పడుతున్నాయని తెలిపారు. వాట్సప్ గవర్నెన్సు సేవలను ఏపీ ప్రారంభించగానే అటు మహారాష్ట్ర కూడా నెల తర్వాత దీన్ని మొదలు పెట్టిందన్నారు. గ్రామవార్డు సచివాలయాలు తీసుకువచ్చాక గత ప్రభుత్వం మీసేవా కేంద్రాల నుంచి కొన్ని సేవలను తొలగించిందన్నారు. ఇప్పుడు వాట్సప్ గవర్నెన్సు వచ్చినంత మాత్రాన మీసేవా కేంద్రాల నుంచి సేవలను తొలగించబోమని స్పష్టం చేశారు. ప్రజలు కావాలనుకుంటే వాట్సప్ గవర్నెన్సు ద్వారా లేదంటే మీసేవా ద్వారా ప్రభుత్వ సేవలు పొందొచ్చన్నారు.

**సీఎం లక్ష్యమిదే.. :**

క్యూఆర్ కోడ్ ద్వారా ఒక్కసారి ధృవీకరణ పత్రం జారీ అయితే అది శాశ్వతంగా ఇచ్చినట్టే అని వెల్లడించారు. ప్రతీ ఆరు నెలలకూ ఓ సారి ధృవీకరణ పత్రం పొందాలంటే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ధాన్యం సేకరణను కూడా దీంతో అనుసంధానం చేయాలని నిర్ణయించామని చెప్పారు. ప్రభుత్వం అంటే కార్యాలయం కాదని.. అందించే సేవలు గుర్తుకు రావాలన్నారు. ఏది అమలు చేసినా ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉండాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమని తెలిపారు. ఆయన లక్ష్యానికి అనుగుణంగా పనిచేసి వాట్సప్ గవర్నెన్సు మన మిత్ర సేవలను ప్రజలకు చేరువ చేస్తామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# రాష్ట్రంలో క్రీడలకు పునర్ వైభవం


- ప్రజాప్రతినిధులకు క్రీడలు ఆటవిడుపు
- ప్రజాప్రతినిధుల ఆటలతో కోలాహలంగా ఇందిరా గాంధీ స్టేడియం
- స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

విజయవాడ, మార్చి 18 (జనస్వరం) : శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు ఆటవిడుపు కల్పించాలనే ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం క్రీడలను ప్రారంభించిందని రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల క్రీడా పోటీలను విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో మంగళవారం మంత్రులు, ఉపసభాపతి కే.రఘురామ కృష్ణం రాజుతో కలసి ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు రోజూ బిజీగా ఫోన్ మాట్లాడుకుంటారని, కనీసం ఈ 3 రోజులైనా మొబైల్ ఫోన్ ను పక్కన పెట్టి క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. ప్రజాప్రతినిధులకు క్రీడలు కొత్త సంప్రదాయం కాదని మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ హయాంలోనే ఎమ్మెల్యేల క్రీడలకు శ్రీకారం చుట్టామన్నారు. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావుకు క్రీడలన్నా, సాంస్కృతిక కార్యక్రమాలన్నా చాలా మక్కువన్నారు. గత ప్రభుత్వ కాలంలో ప్రజాప్రతినిధుల క్రీడలు మరుగున పడిపోయాయన్నారు. ప్రజాప్రతినిధుల క్రీడలతో కోలాహలంగా




ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం మారిందన్నారు. మూడు రోజులపాటు ప్రజాప్రతినిధులు విధిగా క్రీడల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో క్రీడలకు పూర్వవైభవం చేకూరేలా అందరూ సహకరించాలన్నారు. అసెంబ్లీ మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించి, 2 గంటల తరువాత క్రీడల్లో పాల్గొంటామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఉపసభాపతి కనుమూరు రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల్లో కూడా ఎంతో మంది నేషనల్ ప్లేయర్స్ ఉన్నారన్నారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో కృషి చేయాలన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సెషన్‌లోనే క్రీడలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడా ప్రోత్సాహకాలు పెంచి క్రీడలకు అత్యధిక ప్రోత్సహం అందిస్తుందన్నారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్రంలో క్రీడాకారులకు మంచి అవకాశాలు వచ్చాయన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ అయ్యన్నపాత్రుడు ఆదేశాలతో ప్రతిష్టాత్మకంగా క్రీడల నిర్వహణను చేపట్టడం జరిగిందన్నారు. ప్రజాప్రతినిధుల క్రీడల నిర్వహణతో పాత సాంప్రదాయానికి నాంది పలకటం జరిగిందన్నారు. క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, క్రీడల కమిటీ సహకారంతో పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు. శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల క్రీడా పోటీలను శాప్ ఆధ్వర్యంలో చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. తొలుత మంత్రులు, ఛీఫ్ విప్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజులు క్రీడా జ్యోతిని వెలిగించి మార్చ్‌ఫాస్ట్ నిర్వహించిన క్రీడల నిర్వహణ కమిటీ సభ్యులైన ఎమ్మెల్యేలు.. ఈ రోజు థగ్ ఆఫ్ వార్ పోటీలో పాల్గొని తాడు లాగిన మహిళా మంత్రులు.. మంత్రి సంధ్యారాణి వెర్సెస్ మంత్రి అనిత టీమ్.. థగ్ ఆఫ్ వార్‌లో సంధ్యారాణి టీమ్ గెలిచింది. అదేవిధంగా థగ్ ఆఫ్ వార్‌లో మహిళా ప్రజాప్రతినిధులు వెర్సెస్ పురుష ప్రజాప్రతినిధుల పోటీలో మహిళలే గెలిచారు. అదేవిధంగా ప్రజాప్రతినిధుల్లో సీఎం, స్పీకర్ టీములుగా క్రికెట్‌లో పోటీ పడ్డారు. వాలీబాల్, షటిల్ తదితర పోటీలు కూడా నిర్వహించారు.

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

**తేదీ : 19 మార్చి 2025,**

**తిథి : బహుళ పంచమి (20తా తె.00:40 వ.కు),**

**నక్షత్రం : విశాఖ (రా.08:51 వ.కు)**

**బ్రహ్మ ముహూర్తం : తె.04:49ల తె.05:37**

**రాహుకాలం : మ.12:24ల మ.01:54,**

**యమగండం : ఉ.07:54ల ఉ.09:24,**

**వర్జ్యకాలం : తె.00:10, తె.02:11 20తా తె.01:19ల, తె.03:20**

## ఈ రోజు నమాజ్ వేళలు

**తేదీ : 19 మార్చి 2025**

**ఫజర్ : తెల్లవారుజామున గం. 05:14**

**సూర్యోదయం : ఉదయం గం. 06:24**

**జొహర్ : మధ్యాహ్నం గం. 12:28**

**అసర్ : సాయంత్రం గం. 03:48**

**మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:31**

**ఇష : రాత్రి గం. 07:42**





జన స్వరం

**విలేకరులు కావలెను**

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు

రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..

అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్

ఫోన్ నెం : 7013030690

మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# రాజధాని రయ్‌రయ్.. అమరావతికి బలమైన పునాది!

ఫ్యూచర్లో అడ్డంకులు రావొద్దు. అపోహలకు కూడా తావు లేదు. సగటు ఆంధ్రుడు ఏపీ రాజధాని అంటే అమరావతి అని గర్వంగా చెప్పుకోవాల్సిందే. గత ఐదేళ్లలో జరిగిన డ్యామేజ్ చాలు. మళ్లీ అలాంటి సీన్ రిపీట్ కావొద్దు అంటున్నారు ఏపీ సీఎం చంద్రబాబు. రెండోసారి నవ్యాంధ్రకు సీఎం అయినప్పటి నుంచి రాజధాని విషయంలో పకడ్బందీ వ్యూహ రచన చేస్తున్నారు. ఏపీ రాజధాని అమరావతే. ఫిక్స్ అయిపోండి అంటూ క్లారిటీ ఇస్తోంది. అందుకోసం అమరావతికి కేంద్రం ఆమోదంతో గెజిట్ ఇచ్చేలా కసరత్తు చేస్తోంది. అంతేకాదు ఎన్డీయే సర్కార్లో భాగస్వామిగా ఉండటంతో ఇప్పటికే 15వేల కోట్ల రూపాయలు సాంక్షన్ చేయించారు చంద్రబాబు. మరో పన్నెండు వేల కోట్ల రూపాయలు వివిధ ఏజెన్సీల ద్వారా వస్తాయని కూడా చెబుతున్నారు. ఇంకా మిగతా ప్రాజెక్టుల కోసం కూడా నిధులు ఇవ్వాలని ప్రధాని మోదీని కోరుతున్నారు. ఈ క్రమంలోనే మూడేళ్లలో అమరావతి రాజధాని పనులు కంప్లీట్ చేస్తామని చెప్తోంది కూటమి సర్కార్. విభజన తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ అమరావతే రాజధాని అని శాసనసభలో తీర్మానం చేసింది. టీడీపీ అయిదేళ్ళ పాలనలో అమరావతి రాజధానిగానే చాలా కార్యక్రమాలు చేపట్టారు. క్యాపిటల్ సిటీ నిర్మాణంపై గొప్పగా డిజైన్లు తీర్చిదిద్దారు. అమరావతిని ప్రపంచ రాజధానిగా చేయాలని ప్లాన్స్ రూపొందించారు. ప్రధాని మోదీని ఆహ్వానించి.. రాజధాని పనులను గొప్పగా ప్రారంభించారు. సెక్రటేరియట్తో పాటు కొన్ని బిల్డింగ్స్ పనులు కూడా పూర్తయ్యాయి.

**పీఎంను ఇన్వైట్ చేసి పనులు పునః ప్రారంభం! :**

ఆలోగా వైసీపీ ప్రభుత్వం రావడంతో అమరావతి రాజధాని ప్రభ మసకబారింది. దానికి బదులుగా మూడు రాజధానుల కాన్సెప్ట్ ను ముందుకు తెచ్చింది వైసీపీ. అలా ఏపీ రాజధాని ఏంటో క్లారిటీ లేక జోకులు వేసుకునే పరిస్థితి ఉండేది. అమరావతి క్యాపిటల్ గా ఉండదేమోనని వచ్చే ఇన్వెస్టర్లు కూడా రాలేదు. గతంలో చేపట్టిన ప్రాజెక్టులు మూలకు పడ్డాయి. ఓ రకంగా క్యాపిటల్ సిటీ కళ తప్పింది. 2024లో తిరిగి కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక అమరావతి రాజధాని పనుల మీద దూకుడు పెంచింది.




రాజధాని అమరావతికి ఏరియాలో జంగిల్ క్లియరెన్స్ పనులు జెట్ స్పీడ్తో పూర్తి చేసింది. త్వరలోనే మళ్లీ అమరావతి పనులు మొదలుపెట్టేందుకు రెడీ అవుతోంది కూటమి సర్కార్. గతంలోనే మోదీ చేతుల మీదగా అమరావతికి శంకుస్థాపన చేయగా.. ఇప్పుడు మరోసారి పీఎంను ఇన్వైట్ చేసి పనులు పునః ప్రారంభం చేయాలని అనుకుంటోంది. అంతేకాదు రాజధాని విషయంలో వైసీపీని పూర్తిస్థాయిలో కార్నర్ చేస్తోంది. ఇంత జరిగాక.. ఇప్పటికీ మూడు రాజధానుల కాన్సెప్ట్కే కట్టుబడే ఉన్నారా అంటూ నిలదీస్తోంది. అపోజిషన్ మాత్రం క్యాపిటల్ విషయంలో తమ స్టాండ్ ఏంటో చెప్తామ్ అంటున్నారే తప్ప క్లారిటీ ఇవ్వడం లేదు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని అమరావతి విషయంలో ఈసారి జనాలకు క్లియర్ కట్ పిక్చర్ వచ్చేలా పనులు చేపడుతోంది కూటమి సర్కార్. ఫ్యూచర్లో ఎలాంటి కన్ఫ్యూజన్, క్లాషెస్ లేకుండా.. అమరావతే రాజధాని అని అందరూ ఫిక్స్ అయి

## ఎడిటోరియల్

పోయేలా పక్కా స్కెచ్చు ఫాలో అవుతున్నారు సీఎం చంద్రబాబు.

**బ్యాగ్రౌండ్ వర్క్ :**

ఏపీకి రాజధాని అమరావతి అని కేంద్రం అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చేలా బ్యాగ్రౌండ్ వర్క్ చేస్తోంది. మరోసారి ప్రధాని చేతుల మీదుగా పనులు ప్రారంభించి.. నిధులు ఇవ్వాలని రిక్వెస్ట్ చేయడంతో.. మోదీ నోట అమరావతే రాజధాని అని ప్రకటన చేయించేలా ప్రయత్నం చేస్తోంది. అప్పుడు ఇన్వెస్టర్లకు, పారిశ్రామికవేత్తలకు, ప్రజలకు అందరికీ ఓ క్లారిటీ వస్తుందని.. ఇక ఎవరు అధికారంలోకి వచ్చినా.. ప్రభుత్వాలు మారినా.. అమరావతి దానంతట అదే డెవలప్ అయ్యే సిచ్యువేషన్ వస్తుందని భావిస్తోంది. అమరావతే రాజధాని అని క్లియర్ కట్ గా చెప్పేస్తున్నారు సీఎం చంద్రబాబు. గత ఐదేళ్లలో ఏర్పడిన గందరగోళానికి.. ఈ ఎనిమిది నెలల్లో కొంత వరకు చెక్ పెట్టారు. వీలైనంత త్వరగా రాజధాని మీద కేంద్రం గెజిట్ ఇస్తే.. ప్రధాని చేతుల మీదుగా మళ్లీ పనులు ప్రారంభించి.. అమరావతి నిర్మాణంపై ఫుల్ ఫోకస్ పెట్టాలని అనుకుంటున్నారట. ఫ్యూచర్లో రాజధానిని మారుస్తారేమోనన్న ఊహాగానాలు, అనుమానాలు రాకుండా.. ప్రతి విషయంలో చాలా కేర్ తీసుకుంటున్నారు సీఎం చంద్రబాబు. అమరావతి ఫ్యూచర్ ఎలా ఉండబోతోందో చూడాలి మరి.


**జమ్ము సాయి కల్యాణ్,**
**పొలిటికల్ అనలిస్టు,**
**మేనేజింగ్ డైరెక్టర్,**
**జనస్వరం మీడియా.**



### అరబ్ దేశాలకు
# పులివెందుల అరటి

**- దేశ రాజధానిలో మంచి డిమాండ్**

**- కాసులు కురిపిస్తున్న మన బనానా**



**పులివెందుల, మార్చి 18 (జనస్వరం) :** వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల ప్రాంతంలో సాగుచేసిన అరటి అరబ్ దేశాలకు ఎగుమతి అవుతోంది. అంతేకాదు దేశరాజధాని ఢిల్లీలో కూడా మంచి డిమాండ్ ఉంది. దీనితో అరటి పంట రైతన్నకు కాసులు కురిపిస్తోంది. సాగు వివరాల గురించి ఒక్కసారి ఆలోచిద్దాం. ఈ ప్రాంతం అరటి సాగుకు అనుకులించడం, కృష్ణా జలాలు అందిబాటులో ఉండటతో ప్రతి యేటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో మంచి డిమాండ్ ఉన్న ఈ అరటి ఇటీవల కాలంలో గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతూ నాణ్యత విషయంలో తగ్గేదే లేదంటోంది. ఈ ప్రాంతంలో సాగయ్యే అరటికి బయట మార్కెట్లో మంచి డిమాండ్ ఉండడంతో వ్యాపారులు నేరుగా తోటల వద్దకు వస్తున్నారు. ఢిల్లీ మార్కెట్ కు అనుకూలంగా ఉన్న తోటలను ఎంచుకుని అరటికాయలను కొనుగోలు చేస్తున్నారు. రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి ధరలు నిర్ణయించి కొనుగోలు చేయడం ద్వారా దళారుల బెడద లేకుండా పోయిందని రైతన్నలూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఎకరాకు రూ.60వేలు పైనే పెట్టుబడులు :**

అరటి సాగులో పెట్టుబడులు కూడా అధికం అవుతున్నాయి. ఎకరా సాగు చేయాలంటే రూ.60వేల నుంచి రూ.70వేల వరకు పెట్టుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. అరటి నాటిన మొదలు గెలలు కోతకు వచ్చే వరకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సాగుచేసిన 11 నెలలకు గెలలు కోతకు వస్తాయి. సాగులో పెట్టుబడులు అవుతున్నప్పటికీ ఆదాయం ఉంటుందనే రైతులు అరటిని సాగు చేస్తున్నారు. డ్రిప్పు ద్వారా నీటి తడులతో పాటు ఎరువులు అందించడం ద్వారా నాణ్యమైన అరటి ఉత్పత్తులు అందుతున్నాయి. సాగులో ఎకరాకు 10 నుంచి 15 టన్నుల వరకు దిగుబడులు వస్తున్నాయి. ఒక్కో గెల 10 నుంచి 12 చీప్లు వేస్తుందని రైతులు అంటున్నారు.

**నియోజకవర్గంలో 10 నుంచి 15వేల ఎకరాల్లో :**

పులివెందుల ననియోజకవర్గ వ్యాప్తంగా 15 వేల ఎకరాల్లో అరటి సాగు ఉంటే ఇందులో 10వేల ఎకరాల్లో గెలలు మొదటి కోతకు రానున్నాయి. నియోజకవర్గంలోని పులివెందుల, లింగాల, వేముల, వేంపల్లె మండలాల్లో అధికంగానూ, తొండూరు, సింహాద్రిపురం మండలాల్లో తక్కువగా అరటి సాగు అవుతోంది. ఒకసారి సాగు చేస్తే మూడు పంటలు తీయవచ్చన్న ఉద్దేశంతో రైతులు అరటిని ఎంచుకుంటున్నారు. ఎక్కువగా మే, జూన్, జూలై నెల్లో సాగుచేస్తారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో కోతకు వచ్చేలా సాగు చేయడం ద్వారా ధరలు ఉంటాయని రైతులు అంటున్నారు.

**అరటికాయలను శుద్ధిచేసి ప్యాకింగ్ :**

పులివెందుల నుంచి అరటి కాయలను ఢిల్లీకి తరలించాలంటే శుద్ధి చేసి ప్యాకింగ్ చేయాల్సి ఉంటుంది. దీంతో తోటల వద్దకు కూలీలు వెళ్లి అరటి గెలలు తీసుకువచ్చి చీపులను వేరుచేస్తారు. వీటిని బ్లీచింగ్ పౌడర్ కలిపిన నీటిలో శుద్ధి చేస్తారు. అలా శుద్ధిచేసిన చీపులను అట్టపెట్టెలో కవరు వేసి అందులో అరటి కాయలను ఉంచి ప్యాకింగ్ చేస్తారు. ఒక్కో అట్టపెట్టెలో 15కిలోల చొప్పున అరటి కాయలను ప్యాక్ చేస్తారు. తోటల వద్దనే తూకాలు వేసి అట్టపెట్టెలను సీజ్ చేస్తారు. అరటికాయలతో ఉన్న అరటి పెట్టెలను లోడ్ చేసి ఢిల్లీ మార్కెట్కు తరలిస్తారు.

**వారం రోజుల పాటు అరటి కాయల నిల్వ :**

పులివెందుల నుంచి అరటిని ఢిల్లీకి తరలించాలంటే వారంరోజులు పడుతుంది. పక్వానికి వచ్చిన గెలలను కొట్టి చీపులను వేరుచేస్తారు. ఎలాంటి రసాయనాలు వాడ-కుండా వారంపాటు నిల్వ ఉండడంతో ఢిల్లీకి చెందిన వ్యాపారులు పులివెందుల అరటి కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. ఒక్కోసారి అరటి గెలలను లారీకి లోడ్ చేసి ఢిల్లీకి తరలిస్తారు. ఇక్కడి నుంచి ఢిల్లీకి వెళ్లేసరికి అరటి గెలలు దెబ్బతినవని, కాయలు నాణ్యతగా ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. గల్ఫ్ దేశాలకు

**పులివెందుల అరటి :**

పులివెందుల ప్రాంతంలో పండిన అరటికి ఢిల్లీ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుంది. ఎక్కువగా ఈ సీజన్లోనే ఇక్కడ అరటి కాయలను తరలిస్తారు. నెలకు 10 నుంచి 15వేల టన్నుల మేర కాయలు ఢిల్లీ మార్కెట్తో పాటు గల్ఫ్ దేశాలు అరబ్, ఇరాక్, ముంబై తదితర ప్రాంతాలకు వెళ్తాయి. ఇక్కడ పండించిన అరటి నాణ్యతగా ఉండడం, వారం రోజుల పాటు నిల్వ ఉండడం వల్ల ఢిల్లీ మార్కెట్తో పాటు గల్ఫ్ దేశాల్లో డిమాండ్ ఉంటుందని, అరటి రైతులు చెబుతున్నారు ఏది ఎమైనా పులివెందుల ప్రాంతంలో పండించిన అరటికి ఢిల్లీలో డిమాండ్ ఉండటంతో పాటు అరబ్ దేశాలకు ఎగుమతి కావడం రైతుల అదృష్టమని చెప్పవచ్చు.

# విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యం..!

**- నిత్యం ఐసీడీఎస్ కార్యాలయంలో తిష్ట**

**- విధి నిర్వహణ గుర్తుకొస్తే తనిఖీలు**

**- తనిఖీల పేరుతో మామూళ్లు వసూళ్లు**

**- అంగన్వాడీలను వేధింపులు**

**- రికార్డులు వ్రాయని పర్యవేక్షకురాళ్లు**

**- అన్ని పనులు అంగన్వాడీలకే అప్పగింత**

**- అర్ధరాత్రిలు వాట్సాప్ మెసేజ్‌లు**

**- అద్దె బిల్లుల్లో వాటాలు**




**ఎమ్మిగనూరు, మార్చి18 (జనస్వరం) :** ఎమ్మిగనూరు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయం మహిళలు, శిశువులు ఏమి లబ్ధి పొందారో? ఏమో తెలియదు. అంగన్వాడీ కేంద్రాలను పర్యవేక్షించే పర్యవేక్షకురాళ్లు మాత్రం విధినిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కడుపులో సల్లా కదలకుండా కూర్చుంటున్నారు. ఎప్పుడో 11 గంటలకు కార్యాలయముకు తగదునమ్మ అంటూ వస్తున్నారు. హాజరు పట్టిలో హాజరు వేసుకుని చల్లటి చెట్టు నీడలో కబురు లాడుకుంటున్నారు. కాసేపు చరవాణిలో ఊసులాడుకుంటున్నారు. పొరపాటున విధి నిర్వహణ గుర్తుకు వస్తే ఏదో? ఒక అంగన్వాడీ సెంటర్‌కు తనిఖీకి వెళ్తారు. అక్కడ నానా హంగామా చేస్తారు. అవి లేవు, ఇవి లేవు అంటూ చిర్రుబుర్రులాడుతారు. అంగన్వాడీలు, ఆయాలపై చిందులకు భయపడిన అంగన్వాడీలు చేయి తడపగానే, అక్కడి నుండి వచ్చేస్తారు. పైగా అంగన్వాడీ కేంద్రానికి తనిఖీకి వెళ్ళినప్పుడు ఆటో ఖర్చులు కూడా అంగన్వాడీలే భరించాలి. ఆలస్యం అయితే మధ్యాహ్న భోజనం పథకం ఏర్పాటు చేయాలి. తీరా మేడంగారు వెళ్లేటప్పుడు సాగనంపి, ఆటో ఎక్కించి రావాలి. అలా చేయని వారిపై పర్యవేక్షకురాళ్లు ఫిర్యాదు చేయడం, సెంటర్లు సరిగా లేదనడం, పిల్లలు తక్కువగా ఉన్నారనడం, సెంటర్లు మారుస్తామని బెదిరించడం, పర్యవేక్షకురాళ్ల తంతైంది. నెలకు ఒకటి, రెండు సార్లు సెక్టార్ మీటింగ్ ఏర్పాటు చేస్తారు. ఆ మీటింగ్‌లో నెల అంతా అంగన్వాడీలు తయారు చేసిన నివేదికను, ఆఫీసు రికార్డులలో అంగన్వాడీలే ఎక్కించాలి. వీరు మాత్రం కుర్చీ వేసుకుని హాయిగా దర్జాగా అజమాయిషీ చేస్తుంటారు. అసలు అంగన్వాడీలు తయారు చేసిన రిపోర్టులు ఆఫీసు రికార్డులలో ఎక్కించాల్సిన బాధ్యత పర్యవేక్షకురాళ్లదే. ఈ విషయం వారు ఏనాడో? మర్చిపోయారు. పైగా వారికి రికార్డులు ఆఫీసు రికార్డు బుక్కులో ఎక్కించడం రాదు. కొందరైతే గతంలో అంగన్వాడీలుగా పనిచేసి అధికారులయ్యారు. గతాన్ని మరిచిపోయారు. ఇప్పుడు మాత్రం అంగన్వాడీలను పట్టిపీడిస్తున్నారు. అంగన్వాడీ కేంద్రాలకు కూడా వెళ్ళని వారు కాదు..1998లో ఇక్కడ తాసిల్దారుగా దత్తాత్రేయ పనిచేసే సమయంలో ఓ అంగన్వాడీ కార్యకర్త నిత్యం ఆయన కార్యాలయంలోనే కూర్చుండేది. ఆయనతో ఊసులాడుతూ ఇకఇకలు పకపకలు లాడేది. ఆమె ఏనాడు అంగన్వాడీ కేంద్రానికి వెళ్లిందో? ఆమెకే తెలుసు. ఇప్పుడు అధికారి అయ్యేసరికి ఎక్కడలేని దర్పం వచ్చింది. అందరినీ గడగడ లాడిస్తోంది. ప్రాజెక్టు పరిధిలో 10 సెక్టార్లను 282 అంగన్వాడీ సెంటర్లో ఉన్నాయి. ఈ 282 సెంటర్లలో సున్నా నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలు అందరూ 28,477 మంది ఉన్నారు. మొత్తం ప్రాజెక్టు పరిధిలో గర్భవతులు 2942, బాలింతలు 2887 మంది ఉన్నారు.

**పర్యవేక్షకురాళ్ల విధి నిర్వహణ :**

తమ సెక్టార్ పరిధిలోని అన్ని అంగన్వాడి సెంటర్ లను మూడు నెలల లోపు కనీసం ఒక్కసారైనా తనిఖీ చేయాలి. సెంటర్లలో ఉన్న లోపాలను గుర్తించి సరిచేయాలి. సరుకులు సక్రమంగా వస్తున్నాయో? లేదో? ఒకవేళ తక్కువ వస్తుంటే? ఎందుకు తక్కువ వస్తున్నాయో గుర్తించి సరి చేయడం, ప్రతి అంగన్వాడీ సెంటర్లలో ప్రతి లబ్ధిదారులకు సరిగ్గా స్టాక్ అందుతుందా? లేదా? అని గుర్తించాలి. దానిలో ఉన్న ఇబ్బందిని సరి చేయాలి. బాలింతలకు, గర్భవతులకు సున్నా నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు సరియైన పోషక పదార్థాలు అందుతున్నాయా? లేదో? చూడాలి. యాప్‌లో గాని అటెండెన్స్‌లో గాని రిజిస్ట్రేషన్ అయినా, కాని వారిని గుర్తించే రిజిస్ట్రేషన్ చేయించడం, ఈ పనిని టీచర్తో దగ్గరుండి చేయించడం స్టాక్‌లో, తేడా వస్తే దానిని సరి చేయడం, అంగన్వాడి సెంటర్‌కు రాని పిల్లలను గుర్తించి, టీచర్లు ఆయాల సహాయంతో పిల్లల్ని పిలిపించడం, వీరు ఇవన్నీ దగ్గరుండి చూసుకోరు. చరవాణిలోనే సంభాషిస్తూ అంగన్వాడీలను దబాయిస్తూ ఉంటారు. స్టాకు రాకపోయినా? అది కూడా అంగన్వాడీలో తప్పే అన్నట్టు గంతులు వేస్తూ ఉంటారు.స్టాకు వచ్చినప్పుడు నుంచి పంపిణీ చేయండి, అంటూ రికార్డులలో రాయడం డంటూ వెంటపడి వేదించి అంగన్వాడీలను రోగాల పాలు చేస్తున్నారు.

**ఐసీడీఎస్ కార్యాలయంలోనే తిష్ట :**

అంగన్వాడీ కేంద్రాలపై పర్యవేక్షించాల్సిన పర్యవేక్షకురాలు హాయిగా కార్యాలయంలోనే తిష్ట వేసుకుంటారు. ఏదో మధ్యాహ్నం అయ్యే సరికి తెచ్చుకున్న క్యారియర్లు ఒకరికొకరు పంచుకొని ముష్టాన్న భోజనం చేస్తారు. ఆ తరువాత కబుర్లు చెట్టు కిందకు చేరుతాయి. అక్కడ కాలక్షేపం పూర్తయిన తర్వాత సాయంత్రం తిరుగు ప్రయాణం కడతారు. ఈ మధ్యలో టీ లేక కాఫీ తెప్పించుకుని సేవిస్తారు. ఈ లోగా అవసరం అనుకుంటే ఏదో ఒక అంగన్వాడి కేంద్రానికి వెళ్లి తుతూ మంత్రంగా తనిఖీలు చేస్తారు. అన్ని సక్రమంగా ఉన్నా ఏదో? ఒక వంక పెట్టి చిందులు వేయడం వారికి అలవాటు. పర్యవేక్షకురాలు చిందులు వేస్తున్నంతసేపు అంగన్వాడీలు మౌనంగా ఉండి పోతున్నారు. నోరు విప్పితే ఏమి ఉపద్రవం ముంచుకొస్తుందో? అన్న భయం వారిది.

**తనిఖీల పేరుతో మామూళ్లు వసూళ్లు :**

ఎమ్మిగనూరు ఐసీడీఎస్ పరిధిలో 10 సెక్టార్లలు ఉన్నాయి. ఇందులో పదిమంది పర్యవేక్షకురాళ్లు పనిచేస్తున్నారు.వారికి ఒక్కొక్కరికి 25 నుండి 30 వరకు అంగన్వాడీ కేంద్రాలను కేటాయించారు. వీటి తనిఖీల బాధ్యత పర్యవేక్షకురాళ్లకు ఉంటుంది. తనిఖీల పేరుతో పర్యవేక్షకురాలు వసూళ్లకు పాల్పడు తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో సెక్టార్ నుండి పరువేక్షకురాళ్లకు నెలకు 10000 చొప్పున ఆదాయం ఉన్నటువంటి ఆరోపణలు. అందు వల్లనే వీరు అంగన్వాడి కేంద్రాల తనిఖీలకు వెళ్తున్నారానే ఆరోపణలకు బలం చేకూరుతుంది. పర్యవేక్షకురాలు వచ్చిన వెంటనే అంగన్వాడీలు వాళ్లకు మామూలుగా ఇచ్చేందుకు సిద్ధం కావాలి. మామూళ్లు తీసుకుని పైగా చీవాట్లు పెట్టి రావడం పదోవేక్షకకురాళ్లకు అలవాటైన పని.

**రికార్డులు రాయని పర్యవేక్షకురాలు :**

మహిళా శిశు సంక్షేమ శాఖలో పనిచేసే పర్యవేక్షకురాళ్లకు విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యం బద్ధకం అధికమైంది. నెల రోజులు పాటు అంగన్వాడీలు పంపిణీ చేసిన సరుకుల లెక్కలు తమ వద్ద ఉన్న రికార్డులో రాయాలి. వాటిని ఆఫీసు రికార్డులలో రాయాల్సిన బాధ్యత పర్యవేక్షకురాళ్లకు ఉంటుంది. కానీ వారు ఆ పనులు చేయరు. అంగన్వాడీలను భయపెట్టి వీటిని మీరే ఆఫీసు రికార్డులను ఎక్కించాలని దబాయిస్తూ ఉంటారు. ఇందుకోసం నెలకు రెండు సార్లు సెక్టార్ మీటింగ్ పెట్టి దగ్గరుండి ఆఫీస్ రికార్డులలో లెక్కలు రాయిస్తుంటారు. నిజానికి ఈ పని పర్యవేక్షకురాలే చేయాల్సి ఉంటుంది. కానీ వాళ్లని చేయమని అజమాయిషీ చేసేవారు లేకపోవడం వల్ల ఇష్టారాజ్యమై పోయింది. పర్యవేక్షకురాళ్లు ఈ విషయాన్ని పూర్తిగా మరిచిపోయారు. కొందరికైతే నేటికీ ఆఫీసు రికార్డులు రాయడం అసలు రాదనే చెప్పాలి.

**అర్ధరాత్రిలు వాట్సాప్ మెసేజ్‌లు :**

అంగన్వాడి పర్యవేక్షకురాళ్లకు అపరాత్రి,అర్ధరాత్రి అనేది ఏమీ ఉండదు. ఎప్పుడు పడితే అప్పుడు వాట్సాప్ మెసేజ్లు పెడుతుంటారు. పెట్టిన వెంటనే అంగన్వాడీలు వాటిని చూసుకోవాలి. చూసుకోకపోతే మళ్ళీ చీవాట్లు. వాట్సాప్ మెసేజ్‌లో మాత్రం ఎంతో వినయంగా మాట్లాడుతుంటారు. అమ్మ మాకు పైనుంచి ఒత్తిడి ఉంది. ఈరోజు ఈ పని పూర్తి చేయండి. లేకపోతే మెమో ఇస్తామని అంటుంటారు. పర్యవేక్షకురాళ్లకు ఒత్తిడి ఉన్న అంగన్వాడీలు భరించాల్సిందే. తమపైన ఒత్తిడిని అంగన్వాడీలకు రుద్ది పర్యవేక్షకురాళ్లు తప్పించుకుంటున్నారు. పైగా చెప్పిన పని ఆరోజు పూర్తి చేయకుంటే వెంటపడి వేధిస్తుంటారు. ఇలా పర్యవేక్షకురాళ్లు వేధింపులు వల్ల అంగన్వాడీలు అనారోగ్యాల గురవుతున్నారు. ఈ విషయాన్ని అధికారులు కానీ, ప్రభుత్వం కానీ, పట్టించుకోదు.


**అద్దె బిల్లుల్లో వాటాలు :**

ప్రస్తుత ప్రభుత్వ పుణ్యమా అని అంగన్వాడీలకు నెలనెలా జీతాలు సక్రమంగా వస్తున్నాయి. అద్దె బిల్లులు మాత్రం మూడు నాలుగు నెలలకు ఒకసారి వస్తాయి. అంతవరకు వీరు చేతి నుండి అద్దె బిల్లులు చెల్లించుకోవాల్సి వస్తుంది. అది మాత్రం అంగన్వాడీ పర్యవేక్షకురాలు చూడరు. అద్దె బిల్లులు పది వేల రూపాయలు రావడంతో పర్యవేక్షకురాళ్ల కళ్ళు ఎర్రగావుతాయి. వీరికి ఇంత డబ్బు వస్తుందా? అనుకుంటారు. అదేమీ తేరగా వచ్చింది కాదు. వెంటనే ఆఫీసులో కీరోల్‌గా వ్యవహరించే ఉద్యోగి నుండి అంగన్వాడీలకు ఫోన్ చేస్తుంది. అమ్మ అద్దె బిల్లులు పడ్డాయి. వాటాలు తెచ్చివ్వండి అంటుంది. ఇలా వసూలు చేసినందుకు ఆమెకు అందులో వాటా ఉంటుంది. అద్దె బిల్లుల్లో నాలుగు శాతం కచ్చితంగా ఇవ్వాల్సిందే. ఇవ్వని వారిని వెంటపడి మరీ వసూలు చేస్తుంటారు. అంటే దాదాపు ఎన్ని నెలల బిల్లు పడితే ఇంత అన్నమాట. ఒక్కో నెలకు నాలుగు శాతం ప్రకారం మూడు నెలల కైతే 1500 రూపాయలు వసూళ్లు చేస్తారు. పట్టణంలో మొత్తం 75 అంగన్వాడి కేంద్రాలు ఉన్నారు. ఇందులో 5 కేంద్రాలు ప్రభుత్వ భవనాల్లో ఉన్నాయి. మిగిలిన 70 కేంద్రాలకు నెలకు 1500 చొప్పున లక్ష అయిదు వేల రూపాయలు వసూళ్లు అవుతుంది. దీన్ని పర్యవేక్షకురాళ్లు సమానంగా పంచుకొని, వసూలు చేసిన కీరోల్ ఉద్యోగికి కూడా వాటాలిస్తున్నారు.

**ప్రాజెక్ట్ అధికారిణీ వివరణ :**

అంగన్వాడీ పర్యవేక్షకురాల్ల వసూళ్ల విషయమై, ప్రభుత్వ రికార్డులు రాయని వైనమై, సక్రమంగా విధులు నిర్వహించక పోవడంపై, సీడీపీఓ సఫరునిసా బేగంను వివరణ కోరగా ఈ విషయాలు తన దృష్టికి రాలేదని, తన దృష్టికి వస్తే అటువంటి పర్యవేక్షరాలపై చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. రెండు మూడు రోజులలో పర్యవేక్షకురాళ్లతో సమావేశం ఏర్పాటు చేసి అన్ని సరివీకృతం చేస్తానని సీడీపీఓ సఫరునీసా బేగం పేర్కొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం



**హైదరాబాద్, మార్చి 18 (జనస్వరం) :** ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం తెలిపింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దళితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పార్టీలో, ప్రభుత్వంలో ఎస్సీలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "బాబూ జగ్జీవన్‌రామ్‌కు కేంద్రంలో వివిధ శాఖల బాధ్యతలు అప్పగించి గౌరవించింది. దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వ్యక్తి దామోదరం సంజీవయ్యను సీఎంగా చేసింది కాంగ్రెస్ పార్టీ. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరిగింది. దశాబ్దాలుగా సాగిన పోరాటంలో ఎంతో మంది ప్రాణాలు అర్పించారు. 2004లో ఉషా మెహ్రా కమిటీ వేసి సమస్య పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రయత్నించింది. ఇన్నాళ్లకు నేను సీఎంగా ఉండగానే సమస్య పరిష్కారం కావటం సంతోషకరం. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన గంటలోపే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం ప్రకటించాం. వెంటనే ఉత్తమ్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం నియమించాం. మంత్రివర్గ ఉపసంఘం సూచన మేరకు షమీమ్ అక్తర్ కమిషన్ నియమించాం. కమిషన్.. ప్రజల నుంచి 8,681 ప్రతిపాదనలు స్వీకరించింది. కమిషన్ నివేదికను ఏ మాత్రం మార్చకుండా ఆమోదించాం. 59 ఎస్సీ ఉప కులాలను 3 గ్రూపులుగా కమిషన్ విభజించింది. 59 కులాలు ఇప్పటివరకు పొందిన ప్రయోజనాల ఆధారంగా కమిషన్ సిఫార్సులు చేసింది" అని సీఎం వివరించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

## అసెంబ్లీలో బీసీ బిల్లు ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నాం

- ఈ చట్టం బీసీల పోరాట మొదటి విజయం
- బీసీ రిజర్వేషన్ల పెంచుతూ చట్టం చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, బిల్లుకు మద్దతు పలికిన రాజకీయ పార్టీలకు ధన్యవాదాలు
- బీసీ జనసైన్యం రాష్ట్ర అధ్యక్షులు సింగం నగేష్ గౌడ్



**హైదరాబాద్, మార్చి 18 (జనస్వరం) :** బీసీలకు విద్యా, ఉద్యోగాల్లో, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రాజకీయ రిజర్వేషన్‌లను 42 శాతం పెంచుతూ సోమవారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందడం హర్షనీయమని బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్యక్షుడు సింగం నగేష్ గౌడ్ హర్ష వ్యక్తం చేశారు, ఈ చట్టం బీసీల మొదటి పోరాట విజయమని ఆయన ప్రకటించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ చట్టం చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, ఇదే సమయంలో ఈ బిల్లుకు బేషరతుగా మద్దతు తెలిపిన బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ పార్టీల నేతలకు సమస్త బీసీ సమాజం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని తెలిపారు. బీసీ బిల్లు ఆమోదం తదుపరి అమలు కోసం ఢిల్లీ కేంద్రంగా జరిగే పోరాటం పైన అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని కోరారు.

## జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం

**పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు**




**బొంరాస్‌పేట, మార్చి 18 (జనస్వరం) :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమం, పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మనస్తత్వవేత్త డాక్టర్ పి.లక్ష్మణ్ పదవ తరగతి విద్యార్థులకు పది పరీక్షలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తప్పనిసరిగా పదవ తరగతి పరీక్షలు ఆత్మవిశ్వాసంతో శ్రద్ధగా రాయాలన్నారు. పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఎవరు తొందరపాటు నిర్ణయాలు తీసుకోరాదని, ప్రతి ఒక్కరూ చదువుతూ మళ్లీ పరీక్షలు రాసేందుకు సిద్ధం కావాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి హరిలాల్, దుద్యాల మండల విద్యాధికారి విజయ రామారావు, కొడంగల్ ఏంఈవో రాంరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింలు గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ జయ కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట రాములు గౌడ్, రాంరెడ్డి, మల్లేష్, సంతోష్, బీజేపీ నాయకులు జగదీష్, రాకంచర్ల పెంటయ్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బకారం మల్లయ్య, బకారం చంద్రశేఖర్, అనిల్ కుమార్, గౌరారం గోపాల్, తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు రవీందర్ గౌడ్, జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సీఆర్పీ.. సాధించాడు.. హాస్టల్ వెల్ఫేర్ అధికారి ఉద్యోగం



**దుద్యాల, మార్చి 18 (జనస్వరం) :** మండల కేంద్రానికి చెందిన మాసుల పద్మమ్మ, మాసుల చిన్న సాయన్న కుమారుడు మాసుల శశివర్ధన్ ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో 11 సంవత్సరాలుగా సీఆర్పీగా విధులు నిర్వ హిస్తూ మరోవైపు ఉద్యోగం కోసం సన్నద్ధమై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన హాస్టల్ వెల్ఫేర్ అధికారిగా ఉద్యోగం సాధించాడు. శశివర్ధన్ ఉద్యోగం సాధించడం పట్ల తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు సన్నిహి తులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మం డల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో మంగళవారం తెలంగాణ హాస్టల్ వెల్ఫేర్ అధికారిగా ప్రభుత్వ ఉద్యోగం సాధించిన శశివర్ధన్‌ను ఎంఈఓ విజయరామారావు ఆధ్వర్యం లో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మల్లప్ప, రవీందర్ గౌడ్, సుధాకర్ రావు, రాములు, అభయ్ కుమార్, హెచ్ఎం చందర్, రమేష్, ముకుంద రెడ్డి, సాలిబాయి, మాధవి తదితరులు పాల్గొన్నారు.




ఎవరెస్టు శిఖరం బేస్ క్యాంపు వద్ద న్యాయవాది లాసెట్టి రవీందర్

## సీజ్ చేసిన ఇసుక వేలంపాట



**బొంరాస్‌పేట, మార్చి 18 (జనస్వరం) :** మండల పరిధిలోని దుప్చర్ల గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 15 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు మంగళవారం బహిరంగ వేలంపాట నిర్వహించారు. వేలంపాట ద్వారా 15 ట్రాక్టర్ల ఇసుకను గ్రామానికి చెందిన పట్లోళ్ల శ్రీనివాస్ రెడ్డి రూ.29,500 దక్కించుకున్నట్లు ఆర్ఐ శిరీష తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**బొంరాస్‌పేట, మార్చి 18 (జనస్వరం) :** వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి మంగళవారం మండల పరిధిలోని ఏర్పుమళ్ళ గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అంజిల్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింలు గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్, నాయకులు రామచంద్ర రెడ్డి, మల్లేష్, పంచాయతీరాజ్ ఏఈ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## "జయకేతనం" సభా ప్రాంగణంలో స్వచ్ఛ భారత్ సేవా కార్యక్రమం



**పిఠాపురం, మార్చి 18 (జనస్వరం) :** మండలంలోని చిత్రాడ గ్రామంలో జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం వైభవంగా విజయవంతంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా, పార్టీ పెద్దల ఆదేశాల మేరకు, సభా ప్రాంగణంలో "క్లీన్ ఆంధ్ర గ్రీన్ ఆంధ్ర స్వచ్ఛ భారత్" సేవా కార్యక్రమంలో పాల్గొన గా, పిఠాపురం జనసేన నాయకులు సమష్టిగా ప్రాంగణాన్ని పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌లిలి పెంకే జగదీష్, చెల్లిబోయిన సతీష్, విద్యా కమిటీ చైర్మన్ దేశిరెడ్డి సతీష్, చిత్రాడ నీటి సంఘం ప్రెసిడెంట్ బస్వా నాగసత్తులు, నంద్యాల జాన్ బావిశెట్టి నందీశ్వరరావు, తేలు శ్రీనివాస్, యాగ సతీష్, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

జన స్వరం
www.janaswaram.com
తెలంగాణ

## ఆశలను నిరాశ పరచకండి.. వేతనాలు పెంచండి

**జోగులాంబ గద్వాల జిల్లా యూనియన్ నేత జయప్రకాశ్ డిమాండ్**



**జోగులాంబ గద్వాల, మార్చి 18 (జనస్వరం) :** రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్యకర్తలు చేస్తున్న కష్టానికి తగిన పారితోషికం కల్పించాలని తెలంగాణా రాష్ట్ర పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్టీయూసీ) జోగులాంబ గద్వాల జిల్లా ప్రెసిడెంట్ జయప్రకాశ్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని 607 మంది ఆశా కార్యకర్తలు 20 ఏళ్లుగా తక్కువ వేతనంతో (రూ.9,900) పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండనక, వాననక, అహర్నిశలు కష్టపడుతూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఆశావర్కర్లకు కనీసం రూ.18,000 వేతనం నెలకు ఇవ్వాలని, అలాగే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు కల్పించాలని కోరారు.

**అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలి :**

2023లో సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 9 వరకు నిరవధిక సమ్మె చేసినా ప్రభుత్వం వారి డిమాండ్లను పూర్తిగా పరిష్కరించలేదని ఆయన గుర్తుచేశారు. 2023 అక్టోబర్ 9న హైదరాబాద్ కోఠి కమిషనర్ కార్యాలయం ముందు వేలాది మంది ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించగా, ఆరోగ్య శాఖ అధికారులు కొన్ని హామీలు ఇచ్చారని ఆయన తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో ఆశా వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. 2024లో ఫిబ్రవరి 9, జూలై 30, డిసెంబర్ 10 తేదీల్లో కూడా ఆశా యూనియన్ నాయకులు కమీషనర్ కార్యాలయం వద్ద ధర్నాలు చేశారు.

**ప్రభుత్వం హామీలు నిలబెట్టుకోవాలి :**

ఆరోగ్యశాఖ కమీషనర్ ఆశావర్కర్లకు రూ.50 లక్షల ఇన్సూరెన్స్, మరణిస్తే రూ.50,000 అంత్యక్రియ ఖర్చు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సెలవులు, టార్గెట్ రద్దు హామీలు ఇచ్చారని జయప్రకాశ్ తెలిపారు. అయితే ఇప్పటికీ వేతన పెంపు ప్రకటన లేకపోవడం నిరాశ కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో సీఎం ఏనుముల రేవంత్ రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజా నరసింహా స్పందించి ఆశా వేతనాన్ని రూ.18,000గా పెంచే నిర్ణయం తీసుకోవాలని ఐఎన్టీయూసీ జిల్లా ప్రెసిడెంట్ జయప్రకాశ్ విజ్ఞప్తి చేశారు.

## పావ్వా ప్రవేశపెడుతున్న కొత్త "క్వార్టర్ కల్చర్" భోజనం

**హైదరాబాద్‌లో ప్రత్యేక ఆహార అనుభవం**





**హైదరాబాద్, మార్చ్ 18 (జనస్వరం) :** హైదరాబాద్‌లోని భోజన ప్రియుల కోసం ప్రత్యేక ఆహార పానీయాలు అందిస్తున్న పావ్వా వారి నూతన ఆలోచన "క్వార్టర్ కల్చర్" అనే భోజనాన్ని పరిచయం చేసింది. ఈ కొత్త భావన ద్వారా అధిక మోతాదులు, అధిక ఖర్చులు లేకుండా, భోజన ప్రియులు స్వీకరించడానికి తక్కువ పరిమాణంలో, తక్కువ ఖర్చులో నూతన ఆహారం ఆరాధించవచ్చని పావ్వా వ్యవస్థాపకుడు సంజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. "క్వార్టర్ కల్చర్" ద్వారా, తక్కువ తినే వారికీ, అలాగే తక్కువ పానీయాలు తీసుకునే వారికీ, ఓ అద్భుతమైన ఆహార అనుభవం అందించడమే లక్ష్యంగా కొత్త ఆలోచనను ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. క్వార్టర్ మెనూ, ఆఫ్ మెనూ, ఫుల్ మెనూ రూపాల్లో, శాఖాహారం, మాంసాహారం, మరియు ఇతర వివిధ రకాల భోజనాలు అందించడం జరుగుతుందని, ఒకరికి, ఇద్దరికి సరిపడే మోతాదులో ఈ ఆహారాలను అందించడం ప్రత్యేకత అని అన్నారు. కొంపని హాస్పిటాలిటీ వ్యవస్థాపకుడు సోంబీర్ మాట్లాడుతూ, "ప్రవేశపెట్టే కొత్త మెనూ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాం," అన్నారు. ఈ కార్యక్రమంలో, పావ్వా ఎగ్జిక్యూటివ్ చెఫ్ కేతావత్ గోవింద్ మాట్లాడుతూ, "మా ప్రత్యేకత అన్ని రకాల ఆహారాలను, పానీయాలను అందించడం," అని తెలిపారు. మార్చి 21 నుంచి కొత్త మెనూను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు.

## వాటర్ ట్యాంకర్ డ్రైవర్లతో ప్రత్యేక భేటీ





**హైదరాబాద్, మార్చి 18 (జనస్వరం) :** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని వెంకటగిరి వాటర్ ట్యాంక్ కార్యాలయంలో వాటర్ ట్యాంకర్ మేనేజర్ వెంకటేష్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్సై గోపి కలిసి సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా వాటర్ ట్యాంకర్ డ్రైవర్స్ వాహనాల ఫిట్నెస్, డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు ఇన్సూరెన్స్ ఉన్నాయా లేదా అన్న విషయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ట్యాంకర్ అసోసియేషన్ అధ్యక్షుడు, టీడీపీ ఇన్చార్జ్ జీవీజీ నాయుడు కూడా పాల్గొని, వాటర్ ట్యాంకర్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను మేనేజర్ వెంకటేష్‌కు వివరించారు. ప్రత్యేకంగా, రోడ్ నెంబర్ 10 నుండి వచ్చే న్యారో రోడ్డు పావని ఈక్వినాక్స్ దగ్గర మలుపులో వాటర్ ట్యాంకర్లు కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమించేందుకు డ్రైవర్లను హెచ్చరించారు. వాటర్ ట్యాంక్ మేనేజర్ వెంకటేష్ మాట్లాడుతూ, "ముందు, ఈ ప్రాంతంలో మైనర్లు కూడా వాటర్ ట్యాంకర్లు నడిపేవారు. కానీ, నేను వచ్చాక ఈ సమస్యని శాశ్వతంగా పరిష్కరించాం. ఇకపై వాటర్ ట్యాంకర్ల కదలికపై ప్రత్యేకంగా నిఘా పెట్టడం జరుగుతుంది. ఎవరైనా అడ్డదారిలో వాహనాలు నడిపి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ ట్యాంకర్స్ ఫిల్లింగ్ ఇంచార్జ్ జి. దేవేందర్, వాటర్ ట్యాంకర్ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## నాన్న చనిపోయినా.. ఆత్మస్థైర్యంతో పది పరీక్షలు



**పులివెందుల, మార్చి 18 (జనస్వరం) :** నాన్న చనిపోయి అంత్యక్రియలు నిర్వహించిన మరుసటి రోజే ఓ అంధ విద్యార్థి సహాయకుడి సాయంతో పదో తరగతి పరీక్ష రాసిన ఉదంతం వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం వేంపల్లిలో చోటు చేసుకుంది. వేంపల్లె భవిత కేంద్రంలో పదో తరగతి చదువుతున్న అంధ విద్యార్థి రవళి తండ్రి గోపాల్ శనివారం అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. పుట్టెడు దుఃఖంతో ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. మరుసటి రోజు పరీక్షలు రాయనని బాధలో ఉన్న విద్యార్థిని సదరు భవిత కేంద్రం టీచర్ సుజాత ఒప్పించి పరీక్ష రాయించారు.

## భీమేశ్వరస్వామి గుడిలో అద్భుతం



**పులివెందుల, మార్చి 18 (జనస్వరం) :** వైఎస్సార్ కడప జిల్లా వీరపునాయనపల్లె మండలం పాలగిరి భీమేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం అద్భుతం ఆవిష్కరించింది. సూర్య భగవానుని లేత కిరణాలు ఆలయంలోనికి ప్రవేశించి భీమేశ్వర స్వామి పాదాలను తాకాయి. ఈ దృశ్యాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు. ఇది నిజంగా ఒక అద్భుతం అని ఆలయ అర్చకులు ప్రసాద్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కడప జిల్లా పేరు మార్పుపై హర్షం



**పులివెందుల, మార్చి 18 (జనస్వరం) :** వైఎస్సార్ జిల్లాను వైఎస్సార్ కడప జిల్లాగా మారుస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు సూగురు రఘునాథ్, పీవీఎస్వీ ప్రసాదరావులు హర్షం వెలిబుచ్చుతు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కడప జిల్లాకు ఎంతో ఘన చరిత్ర ఉందని బ్రిటిష్ కాలంలోనే కడప జిల్లా పేరు గజెట్‌లో ఉందన్నారు. తిరుమల వెంకటేశ్వర స్వామికి గడప లాంటిదని అందుకే ఈ ప్రాంతానికి కడప అని పేరు వచ్చిందన్నారు. అటువంటి కడప జిల్లా పేరు మరుగున పండిందని, ఎంతో మంది ఆవేదనతో ఉన్నారని అటువంటి వారికి ఈ నిర్ణయం ఎంతో మందికి సంతోషకరమని వారు పేర్కొన్నారు.

## విద్యార్థుల సమస్యలపై సమీక్ష

**ఉర్దు పాఠశాల సందర్శన**



**విజయనగరం, మార్చి 18 (జనస్వరం) :** జనసేన పార్టీ యువ నాయకుడు, ఉత్తరాంధ్ర ఎలక్షన్ కమిటీ మెంబర్ హుస్సేన్ ఖాన్ నియోజకవర్గం లోని స్థానిక తొమ్మిదో డివిజన్ ఉర్దూ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యంతో సమావేశమై, విద్యార్థులకు అందుబాటులో ఉన్న వసతులు, ఎదుర్కొంటున్న సమస్యలను సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, జనసేన కార్యకర్తలు పాల్గొని పాఠశాల అభివృద్ధి, వసతుల మెరుగుదలపై చర్చించారు. విద్యా రంగంలో మరింత పురోగతి కోసం ప్రభుత్వానికి వినతిపత్రం అందజేసేందుకు నేతలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

## జ్యోతి క్షేత్రంలో కూల్చివేతలు దారుణం : కాంగ్రెస్



**పులివెందుల, మార్చి 18 (జనస్వరం) :** కడప జిల్లా కాశి నాయన మండలంలోని జ్యోతి క్షేత్రంలో కూల్చివేతలు దారుణమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కేతిరెడ్డి తిరుపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల తరబడి జ్యోతి క్షేత్రంలో అవధూత కాశినాయన స్వామి భక్తుల నీరాజనాలు అందుకుంటున్నారన్నారు. ఇటీవల కాలంలో టైగర్ ఫారెస్ట్ పేరిట అక్కడ ఆశ్రమాలు, గోశాల, పూదోటలు మరి కొన్ని వాటిని కూల్చివేయడంతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని వెల్లడించారు. కాశి నాయన క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కానీ ఇక్కడ కూల్చివేతలు ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేదన్నారు. వన్యమృగ ప్రాణులు ఉన్నాయంటే అందుకు ప్రభుత్వము భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇవేవి పట్టించుకోకుండా ఒక్కసారిగా కూల్చివేతలు ప్రారంభించడంతో భక్తులు ఆగ్రహిస్తున్నారని తిరుపాల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కూల్చివేసిన వాటిని పునర్ నిర్మించాలని, అలాగే పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. ఇదే విషయాన్ని ఏపీపీసీసీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి, సీనియర్ నేత డాక్టర్ ఎన్.తులసి రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఆయన స్పష్టం చేశారు. భక్తుల అగ్రహాలకు గురికాకముందే ప్రభుత్వం స్పందించి జ్యోతి క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దాలని కాంగ్రెస్ తరఫున కోరుతున్నట్లు పేర్కొన్నారు.

# చట్టాన్ని దుర్వినియోగం చేయరాదు

- చట్టాలు సరిగ్గా తెలియక పోలీసుల ప్రవర్తన
- భారత శిక్షాస్మృతిలో అందరికీ ఒకే చట్టం
- సీనియర్ న్యాయవాది టీ.మల్లేష్



**ఎమ్మిగనూరు, మార్చి 18 (జనస్వరం) :** భారత శిక్షాస్మృతిలో చట్ట ప్రకారం భారతదేశంలో నేరాలు జరిగినప్పుడు, ఆయా ప్రాంతాలను బట్టి నేరం రుజువు చేయుటకు, భారత రాజ్యాంగం పరిధిలను ఏర్పాటు చేసినట్లు సీనియర్ హైకోర్టు న్యాయవాది టీ.మల్లేష్ పేర్కొన్నారు. పరిధులను బట్టి ఆయా ప్రాంతాలలో జరిగే నేరాలను పోలీస్ అధికారులకు విచారించే అధికారం ఉంటుందని, నేరాల అర్హతను బట్టి విచారణ అధికారం ప్రాంతీయ స్టేషన్లకు ఉంటుందని, భారత శిక్షాస్మృతిలో సెక్షన్ 156 సిఆర్పి ప్రకారం ఒక వ్యక్తి నేరం చేసినట్లయితే, ఏ పోలీస్ స్టేషన్లోనైనా కేసు పెట్టవచ్చన్నారు. అదే వ్యక్తిపై వేరే స్టేషన్లో కేసు నమోదైతే దానికి సంబంధించిన ఎఫ్ఐఆర్ను, మొదట కేసు నమోదైన స్టేషన్‌కు పోలీసు అధికారులు పంపాల్సి ఉంటుందని ఆయన వివరించారు. కేసు నమోదైన ప్రతి పోలీస్ స్టేషన్లో విచారించే అధికారం పోలీస్ అధికారులకు ఉండదని తెలిపారు. ఈ మధ్యకాలంలో రాజకీయ నేతపై రాయిచోట్లో నేరం చేసినట్లు కేసు నమోదైందని, మిగతా చోట్ల నమోదైన కేసు వివరాలు ఆ స్టేషన్కే పంపించాల్సి ఉందని, అలా కాకుండా అతనిపై కేసు నమోదు అయిన ప్రతి స్టేషన్‌కు తిప్పుతూ విచారించడం చట్టరీత్యాన్ని నేరమని, ఈ విషయాలు తెలియకుండా పోలీసులు అన్ని స్టేషన్లో ఎలా విచారిస్తారని ప్రశ్నించారు. నేరం జరిగినట్లు కేసు నమోదైన పోలీస్ స్టేషన్ పరిధిలోనే ఉన్న కోర్టుకు నిందితుని హాజరపరచాల్సి ఉంటుందన్నారు. మిగిలిన చోట రిజిస్టర్ అయిన కేసుల విచారణ కూడా అదే కోర్టులో విచారించాల్సి ఉంటుందని తెలిపారు. నిందితుడిపై నమోదైన కేసుల్లో ఒకే రకమైన సెక్షన్లు ఉంటే తీర్పు ఇవ్వడానికి న్యాయమూర్తికి ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ఒకేసారి జరిగిన నేరంకు పలుచోట్ల ఒకే రకమైన సెక్షన్లు ఉన్నప్పుడు విచారణలో వ్యత్యాసం వస్తుందని, నిందితులపై పెట్టిన కేసు బలంగా ఉండదని, కేవలం వ్యక్తిగత కక్షలతోనే కేసు నమోదైన ప్రతి చోటికి నిందితుని తిప్పడం జరుగుతుందన్నారు. నిందితుడి తరపు న్యాయవాదులు ఇవేవీ తెలియకుండా ఎలా వాదిస్తున్నారన్నారు. భారత శిక్షాస్మృతిలో సెక్షన్ 156 సీఆర్పీ నేరం జరిగిన చోటే కేసు నమోదు చేసి అక్కడే విచారించాలని సీనియర్ హైకోర్టు న్యాయవాది టీ.మల్లేష్ వివరించారు.

## అంబేద్కర్ స్థాపించిన పార్టీలో పని చేయడం గర్వంగా ఉంది

- నెల్లూరుకు చెందిన మాబుకి ఆర్పీఐ పార్టీతో ఎలాంటి సంబంధం లేదు
- ఆర్పీఐ జాతీయ కార్యదర్శి పేరం నాగేశ్వర గౌడ్



**నెల్లూరు, మార్చి 18 (జనస్వరం) :** డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నిజాయితీగా స్థాపించిన పార్టీలో పనిచేయడం ఎంతో గర్వంగా ఉందని, ఆంధ్ర రాష్ట్రంలో ఆర్పీఐ పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్టం చేస్తామని, దళిత బహుజనులు ఆర్పీఐ పార్టీని ఆదరించాలని ఆర్పీఐ జాతీయ కార్యదర్శి పేరం నాగేశ్వర గౌడ్ మంగళవారం నెల్లూరులోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరుకు చెందిన మాబు అనే వ్యక్తి కేంద్రమంత్రి రాందాస్ అత్వలె తెలుసనని, ఆర్పీఐ పార్టీ పేరు చెప్పుకొని తిరుగుతున్నాడని అతనికి ఆర్పీఐ పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. మరోసారి కేంద్ర మంత్రి పేరు కానీ, ఆర్పీఐ పార్టీ పేరు కానీ చెప్పుకొని తిరిగితే అతనిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఐ సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యదర్శి మిర్యాల వెంకటరమణయ్య, శ్రీనివాసులు, నారాయణ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రతిభ నైపుణ్యతలతోనే ఉద్యోగ అవకాశాలు

- నూతన టెక్నాలజీ గురించి విద్యార్థులు తెలుసుకోవాలి
- రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వి.వెంకట బసవరావు




**నంద్యాల, మార్చి 18 (జనస్వరం) :** నూతన విద్యా ప్రమాణాలకనుగుణంగా నేటి సమాజంలో విద్యార్థులు ప్రతిభా నైపుణ్యాతల ఆధారంగానే ఉద్యోగ అవకాశాలు ఉంటాయని ప్రతి విద్యార్థి కష్టించి కంప్యూటర్ జ్ఞానాన్ని కూడా పెంపొందించుకోవాలని రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు పేర్కొన్నారు. మంగళవారం శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో కళాశాలల చైర్మన్ డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ ఆధ్వర్యంలో కామెరూన్ 2కే25 అని పేరుతో ఒక జాతీయస్థాయి ఐటీ మీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు శ్రీ రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి సెక్రెటరీ వి.విజయ కుమారి ప్రిన్సిపల్ కేబీవీ సుబ్బయ్య డైరెక్టర్ జి.హేమంత్ రెడ్డి డీన్ ఆఫ్ అకడమిక్స్ ఏఎస్.ప్రగతి రెడ్డి, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్స్ డాక్టర్ యూవీఎస్ కుమార్ కన్వీనర్స్ ఎస్.వెంకట్రావు, దివ్య లత, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు మీ ప్రతిభను కనబరుచుకోవడానికి ఇది ఒక మంచి అవకాశం, మీరు అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ పర అభివృద్ధి పరచుకోవాలని సూచించారు. నూతన టెక్నాలజీ ద్వారా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ, నైపుణ్యాల గురించి విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందిని తెలిపారు. జీవితంలో గెలుపుఓటములు అనేది తరువాత విష యం మీరు మీ ప్రతిభను, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడమే జీవితంలో లక్ష్యసాధన చేరుకుంటా రని తెలిపారు. కళాశాలలో ఐఐటి బాంబే అనుసంధానమై ఆన్లైన్ కోర్స్ పూర్తి చేసిన 27 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పోటీలు అయినా కోడ్ క్వెస్ట్, టెక్నికల్ క్విజ్, పేపర్ ప్రెజెంటేషన్, మైండ్ మారథాన్, కల్చరల్ యాక్టివిటీస్ గురించి ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్న విద్యార్థులకు తెలియజేసి ఈ పోటీలలో పాల్గొనే విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

## కిర్లంపూడిలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం



**కిర్లంపూడి, మార్చి 18 (జనస్వరం) :** మండల కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షులు యడాలి రాంబాబు ఆధ్వర్యంలో గ్రామంలోని విజ్ఞాన భారతి స్కూల్లో నిర్వహించారు. ఈ సమావేశంలో కొత్త మండల అధ్యక్షుడు ఎన్నిక కొరకు అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు, నియోజకవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణ వర్మ,జిల్లా ప్రధాన కార్యదర్శులు దాట్ల వెంకట సూర్యనారాయణ రాజు, గండి కొండలరావు, మట్టా మంగరాజు, కామినేని జయశ్రీ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కంటా కాశీ విశ్వనాథం, దొడ్డా అప్పారావు, శరకణం రాజబాబు, కోనేటి శ్రీనివాస్, బాలిన వెంకటే శ్వరరావు, బొడ్డేటి సత్యనారాయణ, ఐవీవీ సత్యనారాయణ, ఏనుగుపల్లి జలబాబు, మత్స వెంకట రమణ, గోడి లక్ష్మి, భువనగిరి కాశి విశ్వనాథం, అల్లు శివరామకృష్ణ, ఆడారి రామచంద్ర, భూమనా దుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## తాగు నీటి సమస్య పరిష్కరించాలి

**ఖాళీ బిందెలతో నిరసన తెలిపిన ప్రజలు**




**చింతపల్లి, మార్చి 18 (జనస్వరం) :** మండల కేంద్రంలోని సాయి నగర్ వీధిలో రెండేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న మంచినీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ ఆ ప్రాంత ప్రజలు మంగళవారం ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. సాయి నగర్ వీధిలో రెండేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ ముందుగా వారు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. సాయినగర్ వీధిలో రెండేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న మంచినీటి సమస్య తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎంపీడీఓ శ్రీనివాస్ వారిని శాంతింపజేసే ప్రయత్నం చేశారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు రోజుకు మూడు ట్యాంకులతో మంచినీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వెంటనే స్పందించిన వారు మీరు చెప్పే దానికి క్షేత్రస్థాయిలో జరిగే దానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. నెలలో రెండు రోజులు మాత్రమే మంచినీటి ట్యాంకుతో తాగునీరు సరఫరా చేస్తున్నారని, మిగిలిన రోజులు సరఫరా చేయడం లేదన్నారు. ఆర్డబ్ల్యుఎస్ జేఈ స్వర్ణలత మాట్లాడుతూ మండల కేంద్రంలో తాగునీటి నిల్వలు అడుగంటాయని, ప్రతీ ఏడాది జనవరి నుండి ఏప్రిల్ వరకు ఇక్కడ తీవ్ర నీటి ఎద్దడి నెలకొంటుందని నీటి నివారణకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నామనిన్నారు. ప్రస్తుతం హైవే పనుల కారణంగా రెండు కిలో మీటర్ల మేర తాగునీరు సరఫరా చేసే పైపులు ధ్వంసమయ్యాయని, అందువలన ఇప్పటి వరకు అందించే కొద్దిపాటి తాగు నీరు కూడా సరఫరా చేయలేకపోతున్నామన్నారు. మరో నాలుగైదు రోజులలో వాటిని పునరుద్ధరించి తాగునీరు సరఫరా చేస్తామన్నారు. తాగునీటి ఎద్దడి శాశ్వత పరిష్కారానికి బోరు బావులు ఉన్న చోట మోటార్లు బిగించి వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసి పైపుల ద్వారా తాగునీరు సరఫరా చేసే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కాగా క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఇలా ఉండగా జిల్లా అధికారులు జిల్లాలో ఎక్కడా తాగు నీటి ఎద్దడి లేదంటూ ప్రకటనలు ఇవ్వడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది.

## అన్నవరం సత్యదేవున్నీ దర్శించుకున్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్



**అన్నవరం, మార్చి 18 (జనస్వరం) :** మంగళవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ శంఖవరం మండలం అన్నవరం సత్యనారాయణ స్వామిని ఆలయాన్ని దర్శించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో వి. సుబ్బారావు, వేద పండితులు జిల్లా కలెక్టర్‌కు స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రధాన ఆలయం, యంత్రాలయంలోని స్వామివారిని దర్శించుకున్నారు. నిత్య కళ్యాణ మండపం పక్కన ఉన్న మరుగుదొడ్లను జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా పరిశీలించారు. కొండవాలు ప్రాంతానికి అనుకుని ఉన్న ప్రదేశాలను నెలకు ఒకసారి ప్రత్యేక డ్రైవ్ లా చేపట్టి శుభ్రం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం పంపా రిజర్వాయర్‌లోని స్నానాల ఘట్‌ను, పోలవరం లెఫ్ట్ కెనాల్ ఆక్విడేట్ పనులను ఇరిగేషన్, పోలవరం కెనాల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. సత్యదేవుని దర్శనానికి వచ్చే భక్తులకు తాగునీరు, రానున్న ఏప్రిల్, మే నెలల్లో జరిగే చక్రస్నానం స్వామివారి కళ్యాణం, శ్రీరామనవమి వంటి కార్యక్రమంలో నేపథ్యంలో పంప రిజర్వాయర్లు నీరు, పోలవరం కెనాల్ నిర్మాణ పనులకు ఆటంకం లేకుండా చేపట్టాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యదేవు దర్శనం నిమిత్తం దేవాలయానికి వచ్చే భక్తులకు అవసరమైన తాగునీరుకు ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. రానున్న ఏప్రిల్, మే నెలల్లో జరిగే చక్రస్నానం స్వామివారి కళ్యాణం, శ్రీరామనవమి వంటి కార్యక్రమంలో నేపథ్యంలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. పంపాలో నీటిలభ్యత, పోలవరం కెనాల్‌కు నిర్మాణ పనులు జరుగుతున్నందున ఈ పనులకు ఎటువంటి ఆటంకం తలెత్తకుండా అధికారులతో చర్చించి రెండు మూడు రోజుల్లో తగు నిర్ణయం తీసుకోనున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఈ పరిశీలనలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.రామ కృష్ణ, వి.నూకరత్నం, ఇరిగేషన్ ఈఈ జి.శేషగిరిరావు, పోలవరం కెనాల్ ఈఈ డి.శ్రీనివాసులు శంఖవరం తహసీల్దార్ ఎ. తాతారావు, ఎంపీడీవో ఎస్ఎస్.శర్మ, ఆర్డబ్ల్యూఎస్ డీఈ కె శ్రీదేవి, అన్నవరం గ్రామ సర్పంచ్ చెట్టిబత్తుల కుమార్ రాజా, విద్యుత్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, దేవస్థానం ఏఈలు, సూపరింటెండెంట్ ఇంజనీర్లు, ఈఈ తదితరులు పాల్గొన్నారు.

## 23 నుండి చిట్రాలగొప్పు నూకంబిక అమ్మవారి జాతర మహోత్సవం



**చింతపల్లి, మార్చి 18 (జనస్వరం) :** ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు చిట్రాలగొప్పు బద్దిమెట్ట గ్రామాల మధ్యలో కొలువై ఉన్న శ్రీ శ్రీ శ్రీ నూకంబిక అమ్మవారి జాతర మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నామని నూకంబిక అమ్మవారి ఉత్సవ కమిటీ పేర్కొంది. జాతరలో ఎక్కడ ఎటువంటి ఆవంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టడమే కాకుండా గతం కంటే ఈ ఏడాది ఘనంగా నిర్వహిస్తామని, అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి జయప్రదం చేయాలన్నారు. ఈ జాతర మహోత్సవంలో ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి పది గంటల వరకు కుంకుమ పూజ కార్యక్రమం, అదేవిధంగా వివిధ గ్రామాల నుంచి భజన బృందాలు వచ్చి భజన కార్యక్రమం, చివరి రోజు 27న గొందిపాకల గ్రామం నుంచి నూకంబిక అమ్మవారి ఆలయం వరకు డప్పు వాయిదాలు, భజన కార్యక్రమాలతో భారీ ఊరేగింపు కార్యక్రమం, 24న బౌడు సత్యనారాయణ, రొబ్బ హస్వంత్ సహకారంతో అన్న సమరధనా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

# ఆఖిరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

### రైతులకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ భరోసా



**దెందులూరు, మార్చి 18 (జనస్వరం) :** మండలంలోని దెందులూరు గ్రామంలోని సహకార సొసైటీ ప్రాంగణంలో మార్క్ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కనీస మద్దతు అందిస్తూ ఏర్పాటు చేసిన మినుములు, పెసల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభించారు. రైతు సమస్యలపై స్వచ్ఛందంగా స్పందిస్తూ, కేవలం దెందులూరు నియోజకవర్గంలో మాత్రమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతాంగానికి సైతం గతంలో ఎన్నోసార్లు అండగా నిలిచిన అసలైన రైతు బంధు మన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అంటూ అధికారులు, సిబ్బంది, రైతులు కొనియాడారు. బహిరంగ మార్కెట్‌లో క్వింటాలు పెసలుకి సుమారుగా కేవలం రూ.7100 మాత్రమే ధర లభిస్తూ రైతన్నలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చొరవతో మార్క్ఫెడ్, నా ఫ్రెండ్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ పెసలు కొనుగోలు కేంద్రంలో క్వింటాలుకి మద్దతు ధరగా రూ.8681 ఇవ్వటంతో పెసలు రైతులు ఎంతో హర్షం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎప్పుడైనా సరే రైతుల పక్షపాతిగానే వ్యవహరిస్తుందని, ఏ సమస్య వల్లైనా సరే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలిగిన, తన దృష్టికి తీసుకువస్తే సత్వరం పరిష్కరించేలా చర్యలు చేపడతానని తెలిపారు. అదే విధంగా మినుముతో పాటు పెసలు కొనుగోలుకి ఎటువంటి అవాంతరం లేకుండా, రైతుల వద్ద నుంచి ఆఖరి గింజ వరకు కూడా కొనుగోలు చేస్తామని, బహిరంగ మార్కెట్లో పెసలుకి తక్కువ ధర లభిస్తుండడంతో రైతన్నలకు అండగా కూటమి ప్రభుత్వం నిలవాలనే ఉద్దేశంతోనే పెసలకు కనీస మద్దతు ధరగా రూ.8682 ప్రకటించి కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లి బాబు), తెలుగు యువత అధ్యక్షులు మోతుకూరీ నాని, గ్రామ పార్టీ అధ్యక్షులు యిప్పిలి వేంకటేశ్వర రావు (వైవీ ఆర్), సర్పంచ్ తోట యేసమ్మ, క్లస్టర్ ఇంచార్జీ గారపాటి కొండయ్య చౌదరి, తెలుగు రైతు గ్రామ అధ్యక్షులు కూచిపూడి రాంబాబు, కూటమి నాయకులు కలపాల బుజ్జి, తిలక్, పర్వతనేని రంగారావు, బొత్స కిషోర్, కొలుసు నాని, వ్యవసాయ శాఖ జాయింట్ జాయింట్ డైరెక్టర్ హాబీబ్ పాషా, అసిస్టెంట్ డైరెక్టర్ – సుబ్బారావు, వ్యవసాయ అధికారి దామ. వేంకటేశ్వర రావు, మార్క్ ఫెడ్ డీఎం గుప్తా, ఎమ్మార్వో సుమతి సహా పలువురు కూటమి నాయకులు ప్రభుత్వ శాఖల అధికారులు సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అరటి తోట దగ్ధం



**పులివెందుల మార్చి 18 (జనస్వరం) :** నియోజకవర్గంలోని లింగాల మండలంలోని రామనూతల పల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో ఒక అరటి తోట దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినా, సమయస్ఫూర్తితో స్పందించిన రైతులు వాటిని అదుపు చేసి మరింత పెద్ద ప్రమాదాన్ని నివారించారు. స్థానిక రైతు ఒంటెద్దు వేణుగోపాల్ రెడ్డి తన తోటను పరిశీలించేందుకు వెళ్లిన సమయంలో మంటలు వ్యాపిస్తున్న విషయం గమనించి వెంటనే చుట్టుపక్కల రైతులకు సమాచారం అందించారు. క్షణాల్లో స్పందించిన రైతులు కలిసికట్టుగా మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో సుమారు రెండు లక్షల రూపాయల మేర నష్టం జరిగినప్పటికీ, సమయస్ఫూర్తితో స్పందించడం వల్ల మిగతా పొలాలకూ, చుట్టు పక్కల ప్రాంతాలకూ మంటలు వ్యాపించకుండా అరికట్టగలిగారు. ఈ ఘటన పట్ల రైతు వేణుగోపాల్ రెడ్డి తన ఆవేదన వ్యక్తం చేస్తూనే, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ముఖ్యంగా విద్యుత్ తీగలు తోటల మీదుగా వెళ్లే చోట ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం ద్వారా ఇటువంటి ప్రమాదాలను నివారించవచ్చని రైతులు అభిప్రాయపడ్డారు.

## ఖరీఫ్ యాక్షన్ ప్రణాళికపై శిక్షణ...



**పులివెందుల, మార్చి 18 (జనస్వరం) :** స్థానిక ఐజీజీఏఏఎల్‌లో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఖరీఫ్ యాక్షన్ ప్లానింగ్‌పై సిబ్బందికి జిల్లా అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో పీఎండీఎస్, మెట్ట భూములలో వర్షం రాక ముందే విత్తనాలు వేయడం కోసం విత్తన గుళికలు తయారు చేసే విధానం గురించి తెలియజేయడం, లోకల్ రైతులు దగ్గర ఉన్న విత్తనాలను సీడ్ కిట్స్ తయారీ విధా నం, మోడల్స్ వినూత్న పద్ధతి గురించి తెలియజేశారు. రైతు వారీ గా ప్రణాళికపై శిక్షణను ఇచ్చారు. ఈ ట్రైనింగ్‌కి రాష్ట్ర స్థాయి అధి కారి సురేష్ టీఎల్, రమేష్, డీపీఎం ప్రవీణ్ కుమార్, ఆడిసనల్ డీపీఎం వసంత కుమారి, ఎన్ఎఫ్ఏలు, ఎంటీ, ఇంటర్నల్ కమిటీ రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

## రాజేష్ ఖన్నాను ఘన సత్కారం

### పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన పాల్మెన్ పేట వైసీపీ నాయకులు




**పాయకరావుపేట, మార్చి 18 (జనస్వరం) :** వైసీపీ యువ నాయకులు, పాయకరావుపేట పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు దేవవరపు రాజేష్ ఖన్నా పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. వైసీపీ నాయకులు, రాజేష్ ఖన్నా అభిమానులు పెద్ద సంఖ్యలో విచ్చేసి రాజేష్ ఖన్నాకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంధర్భంగా మండలంలోని పాల్మెన్ పేట గ్రామ పంచాయతీ సర్పంచ్ కోడా కోటేశ్వరరావు ఆధ్వర్యంలో వైసీపీ మత్స్యకార యువ నాయకుడు బొడ్డు హరిబాబు తదితరులు రాజేష్ ఖన్నాకు పుట్టినరోజు శుభాకాంక్షలు అందజేశారు. ఈ సంధర్భంగా రాజేష్ ఖన్నా ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువ నాయకులు గరికిన రమణ, చొక్కా సతీష్, గోసల గోపి, అల్లు చంటిబాబు పాల్గొన్నారు.

## అరట్లకోటలో గడ్డివాము దగ్ధం



**పాయకరావుపేట, మార్చి 18 (జనస్వరం) :** మండలంలోని అరట్లకోటలో మంగళవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గ్రామ సచివాకాయం ఎదురుగా ఉన్న రోడ్డులో గడ్డి లోడుతో వస్తోన్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. అదే గ్రామానికి చెందిన రైతు చిట్టిపళ్ల రమణకు చెందిన గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది. ట్రాక్టర్ ట్రాలీ కొంతమేరకు కాలిపోయింది. స్థానికుల సమాచారం మేరకు నక్కపల్లి అగ్నిమాపక దళం సిబ్బంది వచ్చి మంటలను అర్పివేశారు.

## స్మశాన సమస్య తీర్చండి.. ఎంపీడీఓకు వినతి



**తొండంగి మార్చి 18 (జనస్వరం) :** బెండపూడి గ్రామపంచాయతీ పరిధిలో గల తమ్మయ్యపేట లో గల స్మశానవాటిక నందు దహన సంస్కారాలు జరుపుకొనువారికి సదుపాయాలు కల్పించాలంటూ జనసేన నాయకులు తొండంగి ఎంపీడిఓ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు ఇబ్బంది గురి అవుతున్నారని, భవనం నిర్మాణం కొరకు, స్మశాన అవసరం నీటి సదుపాయం కొరకు నిధుల మంజూరు చేయించవలసిందిగా జనసేన తొండంగి మండల అధ్యక్షులు బెండపుడి నాయుడు నేతృత్వంలో తమ్మయ్యపేట జనసేన నాయకులు అయ్యప్ప,బెండపూడి జనసేన నాయకులు బూసాల ప్రవీణ్ కుమార్, తొండంగి మండల జనసేన సహాయ కార్యదర్శి బూసాల సతీష్ లు స్వయంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే తుని ఎమ్మెల్యే యనమల దివ్య, నియోజకవర్గ టీడీపీ నాయకులు యనమల రాజేష్ దృష్టికి తీసుకుని వెళ్ళగా దానికీ సానుకూలంగా స్పందిస్తూ సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కారం కొరకు కృషి చేయాలని తొండంగి మండల ఎంపీడీఓకి మౌఖిక ఆదేశాలు ఇవ్వడంతో ఎంపీడీఓ వెంటనే స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు బెండపూడి నాయుడు తెలిపారు.

## ఆలపాటి రాజేంద్రప్రసాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఘన విజయం

### విజయవాడలో అభినందన సభ



**విజయవాడ, మార్చి 18 (జనస్వరం) :** ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఘన విజయం సాధించిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ నూతన విజయాన్ని జరుపుకుంటూ, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో వెన్యు ఫంక్షన్ హాల్, విజయవాడలో అభినందన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి నెట్టెం శ్రీరఘురామ్ అధ్యక్షత వహించారు. సభ ప్రారంభం కంటే ముందు, పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నెట్టెం శ్రీరఘురామ్ మాట్లాడుతూ, "పార్టీ, జనసేన, బీజేపీ, ఉమ్మడి పార్టీ కార్యకర్తల కష్ట సాహసంతోనే ఆలపాటి రాజేంద్రప్రసాద్ 84,000 ఓట్ల మెజార్టీతో గెలుపు సాధించారు. ఈ విజయం మనందరి కృషి ఫలితం. గతంలో మనం మూడు స్థానాల్లో గెలిచాము, ఇప్పుడు మళ్లీ రెండు స్థానాలు కైవసం చేసుకున్నాము. ముఖ్యంగా, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి లోని 5 పట్టభద్రుల నియోజక వర్గాలను మనం సొంతం చేసుకున్నాం. ఈ విజయాన్ని అందరి సహకారంతో సాధించాం" అన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, "ఈ రోజు అభినందన సభ, సన్మాన సభ నా వ్యక్తిగత గెలుపు కాదు. ఇది కూటమి గెలుపు. నాకు ఇవ్వబడిన అవకాశాన్ని సమర్థంగా నెరవేర్చాలని, ప్రజలకు మంచి పాలన అందించాలని నేను సంకల్పిస్తున్నాను. నా అభ్యర్థిత్వాన్ని చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి ఆధ్వర్యంలో ఎన్నుకోవడం నా కోసం అపూర్వ గౌరవం" అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు వేమూరి ఆనంద్ సూర్య, రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు, నియోజకవర్గాల పరిశీలకులు, పార్టీ రాష్ట్ర నాయకులు ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి పార్టీ మండల, డివిజన్, అనుబంధ సంఘాల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## "నవధాన్యాల సాగు"పై మండల్ లెవల్ కన్వర్జెన్సీ మీటింగ్




**తణుకు, మార్చి 19 (జనస్వరం) :** డివిజన్‌లోని "నవధాన్యాల సాగు" పద్ధతులు అమలు చేయడంలో భాగంగా, ప్రకృతి వ్యవసాయ విధానాలు, అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్, డ్వాక్రా సంఘాల సమిష్టి ప్రణాళిక సిద్ధం చేసేందుకు ఏర్పాటుచేయబడిన మండల్ లెవల్ కన్వర్జెన్సీ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో ఎడిఏ రమేష్, ఏపిఎం రామకృష్ణ, ఎంఏఓ కుసుమకుమారి, మెంటర్ మధుసూదన రావు, ఎం.టి. వై.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఎడిఏ రమేష్ మాట్లాడుతూ, "ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడానికి రైతులకు ముందుగా నవధాన్యాల విత్తనాలు సమకూర్చి అందించడం చాలా ముఖ్యమైన అంశం. ఈ మూడు టీమ్‌లు కలిసి పనిచేసి ప్రకృతి వ్యవసాయ ప్రగతిని సాధించాలి. మన తణుకు డివిజన్‌కు మంచిపేరు వస్తుందని నమ్మకం వ్యక్తం చేస్తున్నాను" అని అన్నారు. ఏ.పి.ఎం. రామకృష్ణ మాట్లాడుతూ, "ప్రకృతి వ్యవసాయ పద్ధతుల పట్ల ప్రతి మహిళకు అవగాహన కలిగి ఉండాలి. కిచెన్ గార్డెన్స్, పెరటితోటలు, రసాయన రహిత కూరగాయల పెంపకంలో మహిళలు ముందుండి సామూహిక ఇన్ పుట్స్ తయారీలో భాగస్వాములు కావడం ద్వారా, సమృద్ధిగా రసాయన రహిత కూరగాయలు అందించడం సాధ్యం అవుతుంది. ఇది మన జీవన విధానంలో మార్పులను తీసుకొస్తుంది" అని వివరించారు. ఎమ్.ఏ.ఓ. కుసుమకుమారి మాట్లాడుతూ, "ప్రకృతి వ్యవసాయ విధానాలు ప్రతి రైతు వద్దకు చేరాలని, రైతులలో అవగాహన తీసుకొచ్చి, నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించడం చాలా ముఖ్యం. మన ప్రణాళికను సక్తివంచన లేకుండా అమలు చేయాలి" అని పేర్కొన్నారు. మెంటర్ మధుసూదనరావు మాట్లాడుతూ, "ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో మొదటి మెట్టు నవధాన్యాల సాగు. ముప్పై రకాల విత్తనాలను వెయ్యడం వల్ల, ప్రతి మొక్క వేరు వ్యవస్థ పోషకాలను కలిగి ఉంటుంది. ఈ విధంగా ఎరువులు అవసరం లేకుండా, పంటలు పోషకాలు అందుకుంటాయి, అలాగే చీడపీడలు ప్రధాన పంటను తట్టుకోగలుగుతాయి" అని వివరించారు. ఎమ్‌టి వై.లక్ష్మి మాట్లాడుతూ, "ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన కూరగాయలు, ఆకుకూరలకు మంచి డిమాండ్ ఉంది. ఈ పద్ధతిలో పండించిన కూరగాయలు ఆరోగ్యకరమైనవి కావడంతో, రైతులకు మంచిలాభాలను అందించడం సాధ్యం అవుతుంది" అని తెలిపారు. మండల ఇన్చార్జ్ షాలేంరాజు మాట్లాడుతూ, "పచ్చిరొట్టలు రైతులు వెయ్యడం వల్ల 365 రోజుల గ్రీన్ కవర్ ఏర్పడుతుంది, దీని ద్వారా భూతాపాన్ని తగ్గించడంలో మనం ముఖ్య పాత్ర వహిస్తాం. భూమిలోని సూక్ష్మజీవులు బ్రతికేందుకు నవధాన్యాలు ప్రతి రైతుతో వెయ్యాలని, ఈ ప్రణాళికలు డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ వై. నూకరాజు గారి ఆదేశాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామంటూ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అగ్రికల్చర్ అధికారులు, డ్వాక్రా సి.సి.లు, యానిమేటర్లు, డ్వాక్రా ఓ.బి.లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## మట్టి పెళ్ళలు విరిగిపడి వ్యక్తి మృతి



**పులివెందుల, మార్చి 18 (జనస్వరం) :** మట్టి పెళ్ళలు విరిగిపడి రామచంద్ర అను వ్యక్తి మృతి చెందిన సంఘటన నియోజకవర్గంలోని వేంపల్లి మండలం కత్తులూరు సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. వేముల మండలంలోని అమ్మయ్య గారి పల్లెకు చెందిన రామచంద్ర సోమవారం ముగ్గు రాళ్ల పనికి వెళ్ళాడు. పని చేస్తున్న సమయంలో ఒక్కసారిగా మట్టి పెళ్ళలు విరిగి పడడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అక్కడే ఉన్న కూలీలు మట్టిలో కూరుకుపోయిన రామచంద్రను వెలికి తీశారు. అప్పటికే రామచంద్ర మృతి చెందినట్లు గని కాంట్రాక్టర్ వెల్లడించారు.

## నిరుపేద కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం




**పాయకరావుపేట, మార్చి 18 (జనస్వరం) :** మండలంలోని పాల్మెన్ పేట పంచాయతీ, రాజయ్య పేట గ్రామానికి చెందిన పిర్ల నూకరాజు (బుజ్జి) మంగళవారం తన పుట్టినరోజు సంధర్భంగా ఒక నిరుపేద కుటుంబానికి శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పది వేలు రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. పిఠాపురం నియోజకవర్గం, గొల్లప్రోలు మండలం, చేబ్రోలు గ్రామానికి చెందిన పెంకే నాగరాజుది నిరుపేద కుటుంబం. ఆమెకు ఉండటానికి ఇల్లు కూడా లేదు. ఆమె కూతురుని కోల్పోయి తన మనవరాలు బసనబోయిన సత్యను చూసుకుంటూ బతుకుతోంది. సత్య కూడా అనారోగ్యంతో ఉంది. ఆమె కూడా నిత్యం మందులు వాడుతోంది. ఈ నిరుపేద కుటుంబానికి పాయకరావుపేట మండలం, పాల్మెన్ పేట పంచాయతీ, రాజయ్యపేట గ్రామానికి చెందిన పిర్ల నూకరాజు (బుజ్జి) మంగళవారం నేరుగా ఆ కుటుంబం దగ్గరకి వెళ్లి తన పుట్టినరోజు సంధర్భంగా రూ.5000లు విలువ చేసే నిత్యవసర సరుకులు, రూ.5000లు నగదు అందజేశారు. ఈ సంధర్భంగా శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు నేమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత తమ పుట్టిన రోజు నాడు కేకులు, పార్టీలు కాకుండా ఇలా పది మంది కడుపు నింపే సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఒక కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ పోలవరపు రాజేష్, చేబ్రోలు గ్రామ పెద్దలు బత్తుల శ్రీను, నేమాల బాబీ, పంచదార్ల శ్రీను, ఫౌండేషన్ సభ్యులు రాయుడు ప్రసాద్, నేమాల గంగాధర్ యాదవ్, పిర్ల దుర్గాప్రసాద్, అంబుజాలపు సత్యదేవ, జాన్ వెస్లీ, యేసుబాబు తదితరులు పాల్గొన్నారు.

## సునీతా విలియమ్స్ క్షేమంగా రావాలంటూ ప్రత్యేక పూజలు

**– గుంటూరులో శ్రీ వీరాంజనేయ స్వామికి ప్రత్యేక అర్చనలు నిర్వహించిన ద జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి**



**గుంటూరు, మార్చి 18 (జనస్వరం) :** అంతరిక్ష పరిశోధకురాలు సునీతా విలియమ్స్ అంతరిక్షం నుంచి భూమి మీదకు క్షేమంగా రావాలంటూ జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఆధ్వర్యంలో శ్రీనివాసరావుతోటలోని శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరికొన్ని గంటల్లో భూమి మీదకు చేరుకోనున్న సునీతా విలియమ్స్, విల్మోర్ ప్రయాణంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా గమ్యాన్ని చేరుకోవాలని మూలవిరాట్ ఆంజనేయస్వామికి సునీతా విలియన్స్ పేరు మీద పూజారి పవన్ కుమార్ ప్రత్యేక అర్చన చేశారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ ఐదు రోజుల పరిశోధన కోసం అంతరిక్షం చేరుకున్న సునీతా విలియమ్స్ బృందానికి అనుకోని అవాంతరాలు ఏర్పడటంతో సుమారు తొమ్మిది నెలల పాటు అంతరిక్షంలోనే ఉండాల్సి వచ్చిందన్నారు. 288 రోజుల తరువాత ఆమె భూమి మీదకు చేరుకోవటానికి అన్ని ఏర్పాట్లు జరిగాయని ఈ ప్రయాణంలో ఎటువంటి సమస్యలు రాకూడదని కోరుకున్నారు. గతంలో ఎన్నోసార్లు అంతరిక్షంలోకి వెళ్లి వచ్చిన సునీతా విలియమ్స్ ఈసారి కూడా క్షేమంగా తిరిగి రావాలని ప్రపంచం అంతా కోరుకుంటుందని ఆళ్ళ హరి తెలిపారు. పూజాది కార్యక్రమంలో కోలా అంజి, వడ్డె సుబ్బారావు, బియ్యం శ్రీను, జే.తోట వెంకటేశ్వర్లు, జక్కా శివన్నారాయణ, సాయి తదితరులు పాల్గొన్నారు.